క్లుప్తంగా

ఈవీఎంలపై బీఎల్వోలు అవగాహన కలిగి ఉండాలి



ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ మల్లికార్జున

వరికుంటపాడు: బీఎల్వో ఈవీఎంలు, ఈవీ ప్యాడ్ల వినియోగంపై సరైన అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ నేలపాటి మల్లికార్జున తెలిపారు. ఆయన మంగళవారం తన కార్యాలయంలో ఈవీఎంలపై బీఎల్వోలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్వరలో ఎన్నికలు జరగనున్న దృష్ట్యా ఈవీఎంల వినియోగంపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. ఓటర్లు ఈవీఎంల వినియోగంపై అవగాహనా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఏఎస్‌పేట బీజేపీ అధ్యక్షుడిగా చెంచులురెడ్డి



బీజేపీ జిల్లా నేతలతో చెంచులురెడ్డి

అనుమసముద్రంపేట: బీజేపీ మండల అధ్యక్షుడిగా శ్రీకొలనుకు చెందిన కల్లూరు చెంచులురెడ్డిని నియమించారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర నాయకులు కర్నాటి ఆంజనేయులురెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కాలం బుజ్జిరెడ్డి, కిసాన్ మోర్చా కార్యదర్శి కప్పరపు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఈ మేరకు కల్లూరు చెంచులురెడ్డిని మండల అధ్యక్షుడిగా నియమిస్తున్నట్లు ప్రకటించారు. త్వరలోనే మండల స్థాయి విస్తృత సమావేశాన్ని నిర్వహించి కమిటీని నియమించాలని, బూత్ కమిటీలు వేయాలని పార్టీని బలోపేతం చేయాలని సూచించారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత



గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న సూపరింటెండెంట్ శేషారత్నం

ఆత్మకూరు: ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో పలువురు గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. మంగళవారం గర్భిణులకు ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షల అనంతరం పౌష్టికాహార లోపంతో ఉన్న గర్భిణులను గుర్తించిన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం తన సొంత ఖర్చులతో వేరుశనగ చిక్కీలు, అరటి పండ్లు, తదితర పౌష్టికాహారాన్ని సిబ్బందితో తెప్పించి అందజేశారు. గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని స్వీకరిస్తున్నారని, అయితే గత నెల రోజులకుపైగా అంగన్‌వాడీల సమ్మెతో పౌష్టికాహారం అందలేదని విషయం తెలుసుకున్న సూపరింటెండెంట్ పౌష్టికాహారం పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆస్పత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో చేరిన అంగన్‌వాడీ కార్యకర్తలు



తాము విధుల్లో చేరుతున్నట్లు వింజమూరు సీడీపీఓ కార్యాలయంలో లెటరు అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

కొండాపురం: మండలంలోని రేణమాలలో కార్యకర్త, ఆయా మంగళవారం విధుల్లో చేరారు. గర్భిణులు, చిన్నారులు, బాలింతలకు పోషకాహారం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని రోజులుగా వివిధ డిమాండ్ల కోసం అంగన్‌వాడీ వర్కర్లు సమ్మె చేస్తున్న విషయం విదితమే. జీతాలు పెంపు మినహా మిగతా డిమాండ్లన్నీ ప్రభుత్వం నెరవేర్చినప్పటికీ కొన్ని యూనియన్ల ప్రభావంతో కొంత మంది అంగనవాడీ కార్యకర్తలు విధుల్లో చేరలేదు. అయితే మంగళవారం నుంచి ఉదయగిరి నియోజకవర్గంలో చాలా చోట్ల అంగన్‌వాడీ కార్యకర్తలు విధుల్లో చేరి తమ కార్యకలాపాలు కొనసాగించారు.

నేటి నుంచి మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా

చేజర్ల: ఈనెల 10వ తేదీ నుంచి ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి ఆటల పోటీలు జరుగుతాయని మండల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ మల్లికార్జున మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 సచివాలయాల నుంచి 15 క్రికెట్ టీమ్‌లు మండల స్థాయికి సెలెక్ట్ అయ్యాయన్నారు. బుధవారం ఆదూరుపల్లి, పాతపాడు క్రికెట్ గ్రౌండ్లలో క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభమవుతాయన్నారు.



విశేష పుష్పాలంకరణలో పోలేరమ్మ ఆలయం



జాతరలో కళాకారుల సాంస్కృతిక ప్రదర్శన

దారులన్నీ.. అల్లూరు వైపే

- వైభవంగా పోలేరమ్మ జాతర
- పోటెత్తిన భక్తులు
- అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ బీద, ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు

అల్లూరు గ్రామదేవత పోలేరమ్మ జాతర మహోత్సవం మంగళవారం ఆచార సంప్రదాయాలను అనుసరించి అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారిని దర్శించుకునేందుకు, మొక్కుబడులు చెల్లించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ పరిసరాలు, గుడి వీధులన్నీ ఇసుక వేస్తే రాలనంతంగా జనంతో కిటకిటలాడిపోయాయి. ఈ దఫా జాతరకు జనం అధికంగా రావడంతో వేకువ నుంచే రద్దీ నెలకొంది. ముత్తయిదువులంతా పసుపు కుంకుమలు, వేప మండలతో అలంకరించిన కుండల్లో చద్ది నివేదనకు భారీగా తరలివచ్చారు. సంప్రదాయాన్ని అనుసరించి మధ్యాహ్నం కొమ్ముకోళ్ల ద్వారా నిర్వహించిన పోలేరమ్మ కథా కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. రాత్రి 10 గంటలకు అమ్మవారి గ్రామోత్సవం ప్రారంభమైంది. అల్లూరు గ్రామ దేవత పోలేరమ్మ జాతరలో భాగంగా రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మంగళవారం రాత్రి అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కార్యనిర్వాహకులు మన్నెమాల సుకుమార్‌రెడ్డి ఎంపీ, ఎమ్మెల్యేలకు స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించిన అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. – కావలి



పసుపు కుంకుమలు, వేప మండలతో అలంకరించిన కుండల్లో చద్ది నివేదనకు భారీగా తరలివస్తున్న ముత్తయిదువులు



పోలేరమ్మ తల్లిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో ఆలయంలో రద్దీ



అమ్మవారిని దర్శించుకునేందుకు బయట బారులు తీరిన భక్తులు

భారీ వాహనాలతో రోడ్డును ధ్వంసం చేశారు

- రోడ్డును పాడు చేసిన వ్యక్తి ఓటు కోసం వస్తే నిలదీయండి
- కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి



గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ప్రజల అవసరాల కోసం రహదారిని నిర్మిస్తే.. వ్యక్తి తన స్వప్రయోజనాల కోసం అధిక లోడుతో భారీ వాహనాలను తిప్పుడూ రహదారిని ధ్వంసం చేశాడని, అతను ఎన్నికల్లో ఓట్లు అడగడానికి వస్తే నిలదీయాలని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని ఆముదాలదిన్నెలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని ఆముదాలదిన్నె – ఏనుగులబావి వయా తాళ్లపాళెం రోడ్డును ధ్వంసం చేసిన వ్యక్తి ఎవరో ప్రజలకు తెలుసన్నారు. ఈ రోడ్డుపై ఎవరు పెద్ద పెద్ద రాళ్లను భారీ వాహనాలతో తోలడం వల్లనే ఈ విధంగా పాడైయిందని తెలిపారు. అయితే రోడ్డును పునర్ నిర్మాణం చేసే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. రానున్న 15–20 రోజుల్లో ఈ రోడ్డు అభివృద్ధి పనులు పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే స్థానిక ప్రజలకు హామీ ఇచ్చారు. తుమ్మలపెంట రోడ్డు నిర్మాణం కాకుండా టీడీపీ నాయకులు అడ్డుకుంటూ, ఆ నెపాన్ని నాపై వేయడానికి కుట్రలు చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలో రూ.2,500 కోట్లు ప్రభుత్వ పథకాలు ద్వారా ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేలు చేశారన్నారు. కావలి నియోజకవర్గం అభివృద్ధి పథంలో ఉండాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు. రానున్న ఎన్నికల్లో కావలి నియోజకవర్గంలో మంచి మెజార్టీతో గెలిపించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కు కానుకగా ఇవ్వాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. కావలికి సంబంధించి రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, కావలి పట్టణంలోని ట్రంక్‌రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయన్నారు. తుమ్మలపెంట రోడ్డును ఇబ్బంది లేకుండా చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు ఉడా బ్రహ్మానందం, సురేష్, ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పందంటి కామరాజు, కుందుర్తి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వేలం కేంద్రం సందర్శన



పొగాకు పంటను పరిశీలిస్తున్న అధికారులు

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రాన్ని మంగళవారం బోర్డు సెక్రటరీ వేణుగోపాల్, ఒంగోలు రీజనల్ మేనేజర్ లక్ష్మణరావు సందర్శించారు. వేలం కేంద్రంలో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. అనంతరం బోర్డు సెక్రటరీ వేణుగోపాల్ మాట్లాడుతూ పొగాకు రైతులకు కావాల్సిన అన్ని సౌకర్యాలను పొగాకు వేలం కేంద్రంలో ఏర్పాటు చేస్తున్నారని, రైతుల అభివృద్ధికి అన్ని విధాలుగా సహకారం అందిస్తామని తెలిపారు. పొగాకు పంటను, క్యూరింగ్‌ను పరిశీలించి రైతులకు తగు సూచనలు ఇచ్చారు. పొగాకు పంటలో సీటీఆర్ఐ సిఫార్సు చేసిన మందులను సూచించిన మోతాదు మేరకే ఉపయోగించాలని, పక్వానికి వచ్చిన ఆకును మాత్రమే రెల్చాలని, ఆకు అల్లేటప్పుడు తప్పకుండా టార్పాలిన్ పట్టలను వేయాలన్నారు. క్యూరింగ్ చేసే సమయంలో తప్పకుండా క్యూరో మీటర్ వాడాలని, బ్యారెన్‌లో ఎక్కువ కర్రలు పెట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రసాయన ఎరువుల వినియోగాన్ని వీలైనంత వరకు తగ్గించుకుని పచ్చిరొట్ట ఎరువులను వాడాలన్నారు. రైతులకు హెచ్‌డీపీఈ లింకు పైపులను సబ్సిడీతో అందించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీసీపల్లి పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి జీ రాజశేఖర్, బోర్డు సిబ్బంది ఉన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి



జగనన్న ఆరోగ్య సురక్షలో అధికారులు, నాయకులు

జలదంకి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పాలవెల్లి మాలకొండారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని చోడవరం సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పేద ప్రజల ఆరోగ్యం కోసం ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.25 లక్షలకు పెంచిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. చోడవరం సర్పంచ్ వల్లంరెడ్డి సుబ్బమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు వల్లంరెడ్డి నరసారెడ్డి దేమెర్ల దేవదాస్ గుమమడి రమేష్, ఆరోన్, పి వెంకటేశ్వర్లు, ఎస్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న తెలుగు భారతి సేవా సమితి సభ్యులు

ఆత్మకూరు: నిత్యాన్నదాత సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు కంచి పరమేశ్వరరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన క్యాలెండర్లను మంగళవారం తెలుగు భారతి సేవా సమితి కార్యాలయంలో ఆవిష్కరించారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాలకు విడివిడిగా క్యాలెండర్లను ముద్రించినట్లు, వీటిని అందరికి పంపిణీ చేస్తున్నట్లు పరమేశ్వరరెడ్డి తెలిపారు. సేవా సమితి కార్యవర్గ సభ్యులు క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యానాదిరెడ్డి, చలమయ్య, కేవీ శేషారెడ్డి, కుడుముల సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు రవి, జి సురేష్‌బాబు, నారాయణరావు, మేధా వెంకట సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా నడివీధి పోలేరమ్మ జాతర



కావలి నడివీధి పోలేరమ్మ జాతరలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి

కావలి: కావలి పాతూరులో నడివీధి పోలేరమ్మ జాతర మంగళవారం నేత్రపర్వంగా సాగింది. కావలికి కంటికి రెప్పలా కాచే పోలేరమ్మ తల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు పట్టణ ప్రజలతో పాటు సమీప గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. జాతరలో భాగంగా సనాతనా సంస్కృతి సంప్రదాయాలను అనుసరించి పోలేరమ్మ అరుగు, శక్తి అమ్మవారు, పోతురాజు ప్రాంగణాలను వేప మండలు, పువ్వులతో ప్రత్యేకంగా అలంకరించారు. ఎటు చూసినా వేపమండల పచ్చదనం, పసుపు కుంకుమల పరిమళాలు, ముత్తైదువుల పూజలతో పాతూరు ప్రత్యేక కళ సంతరించుకుంది. సంప్రదాయాన్ని అనుసరించి పోలేరమ్మ జాతర లేతోటమ్మ గుడి నుంచి బయలుదేరి గాలిగంగమ్మ గుడి మీదుగా పెదపవని బస్టాండ్ మండపం వద్దకు చేరుకుంటుంది. అక్కడి నుంచి పాతూరు పోలేరమ్మ అరుగు వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చి నడి వీధిలో నిలుపుదల చేస్తారు. జాతర ఏర్పాట్లను ఆచార కాపులు, గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గ్రామసభలు

వరికుంటపాడు: మండలంలోని చెన్నంపల్లి, జడదేవి గ్రామాల్లో మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గ్రామసభలు నిర్వహించారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సీహెచ్ వెంకటాద్రి, సీహెచ్‌ఓ రాజశేఖరరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పాలనలో అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పేదల అభ్యున్నతికి కేంద్రం ఎనలేని కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు కొనసాగిస్తాం



మున్సిపల్‌లో సంతకం చేస్తున్న ఆర్డీఓ కె మధులత

ఆత్మకూరు: రాజ్యాంగ రచయిత డాక్టర్ అంబేడ్కర్ ఆశయాలు కొనసాగించేందుకు అందరూ ప్రతిన పూనాలని ఆయన దేశానికి చేసిన సేవలను మరువలేనివని పలువురు వక్తలు అన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ ఎంజీఆర్ సమావేశ మందిరంలో ఆత్మకూరు ఆర్డీఓ కె మధులత ఆధ్వర్యంలో జన్ భాగీదారిలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ ఆదిశేషయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకట రమణమ్మ, ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి, ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, మున్సిపల్ కమిషనర్ బి.నాగేశ్వరరావుతో కలిసి ఆర్డీఓ మధులత జన్ భాగీదారి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అతి భారీ విగ్రహాన్ని 19న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్న తరుణంలో రాష్ట్ర వ్యాప్తంగా పది రోజుల పాటు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొలుత ఆర్డీఓ మధులత సంతకం చేశారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు సంతకాలు చేశారు. మున్సిపల్ ఆర్ఐ ఖాసీం, వైఎస్సార్‌సీపీ నాయకులు నోటి వినయ్‌కుమార్ రెడ్డి, షేక్ రహీం, ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు కొండా వెంకటేశ్వర్లు, అంబేడ్కర్ ఇండియా మిషన్ జిల్లా కన్వీనర్ పి మురళీ, ఉపాధ్యాయులు డాక్టర్ ప్రసాద్, ఆర్ పెంచలయ్య, ఆర్ వెంకటేశ్వర్లు, ఎన్‌జీఓలు వాగాల శ్రీహరి, పెంచల నరసయ్య, రవీంద్ర, పెంచలయ్య, అధిక సంఖ్యలో పొదుపు మహిళలు, మెప్మా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ చేసిన సేవలు మరువలేనివి



సంతకాలు సేకరించిన సచివాలయ సిబ్బంది



ఆత్మకూరు రూరల్: అప్పారావుపాళెం సచివాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఉదయగిరి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలు మరువలేనివని వెంగళరావునగర్ పంచాయతీ కార్యదర్శి అమర్‌నాథ్‌రెడ్డి, సచివాలయ కార్యదర్శి హీనా తెలిపారు. మంగళవారం సచివాలయంలో జన్ భాగీదారి కార్యక్రమంలో భాగంగా సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. పలువురు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎం.తిరుపతయ్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో అంబేడ్కర్‌కు ఘన నివాళి

ఆత్మకూరురూరల్: మండలంలోని అన్ని సచివాలయాల్లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు మంగళవారం ఘన నివాళులర్పించారు. అప్పారావుపాళెం, బట్టేపాడు సచివాలయాల్లో గ్రామ ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు మద్దతు తెలుపుతూ సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమాల్లో స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ



సంగం: సంతకం చేస్తున్న మాజీ మండల కన్వీనర్ కంటాబత్తిన రఘునాథ్‌రెడ్డి

సంగం: స్థానిక తహసీల్దారు కార్యాలయం సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎంపీడీఓ గోపీ ఆధ్వర్యంలో జన్ భాగీదారి కార్యక్రమంలో భాగంగా మంగళవారం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయం సిబ్బంది, దళిత నాయకులు, పలువురు స్థానికులు సంతకాలు చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ కంటాబత్తిన రఘునాథ్‌రెడ్డి, ఏపీఎం విజయలక్ష్మి, దళిత నాయకులు కృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలలో రక్తదాన శిబిరం నేడు

ఆత్మకూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం త్వరలో ఆవిష్కరించనున్న నేపథ్యంలో పట్టణంలోని ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో బుధవారం మెగా రక్తదాన శిబిరం ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం మంగళవారం తెలిపారు. ఆపదలో ఉన్న వారికి రక్తం ఎంతో అవసరమని రక్తదానం చేస్తే ప్రాణదానంతో సమానమని, ఈ విషయాన్ని గుర్తించి యువకులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి తప్పనిసరిగా రక్తదానం చేయాలని ఆమె కోరారు.

ఉపయోగకరంగా ఉపాధి పనులు



మాట్లాడుతున్న ఏపీఓ శ్రీనివాసరావు

కలిగిరి: గ్రామాల్లో అన్ని విధాలుగా ఉపయోగకరంగా ఉండేలా ఉపాధి హామీ పథకం పనులు చేపడుతామని ఏపీఓ శ్రీనివాసరావు తెలిపారు. కృష్ణారెడ్డిపాళెం సచివాలయంలో మంగళవారం 2024 – 25 సంవత్సరానికి సంబంధించి పనుల గుర్తింపు గ్రామ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు నిమ్మ, బత్తాయి వంటి ఉద్యాన పంటలను ఉపాధి హామీ పథకం ద్వారా సాగు చేసుకోవచ్చన్నారు. ఉపాధి పనులను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నలతాటి మహాలక్ష్మమ్మ, పంచాయతీ కార్యదర్శి చెంచు కృష్ణారెడ్డి, టీపీ మధు, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి వికసిత్ భారత్ సంకల్పయాత్ర

ఉదయగిరి: మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో ఈ నెల 10 నుంచి 19వ తేదీ వరకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గ్రామ సభలు జరుగుతాయని ఎంపీడీఓ డీ ఈశ్వరమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం గండిపాళెం, 11న వెంగళరావునగర్, తిరుమలాపురం, 12న అప్పసముద్రం, దాసరపల్లి, 13న ఉదయగిరి, కొండాయపాళెం, 14న గన్నేపల్లి, నేలటూరు, 16న ఆర్లపడియ, కృష్ణంపల్లి, 17న జి.చెరువుపల్లి, జి.చెర్లోపల్లి, 18న బండగానిపల్లి, జి.అయ్యవారిపల్లె, 19న పుల్లాయపల్లె, శకునాలపల్లి పంచాయతీల్లో జరుగుతాయన్నారు.

రేపు చెరువుల్లో చేపల వేలం

జలదంకి: జలదంకి పంచాయతీ పరిధిలోని జలదంకి పెద్ద చెరువు, టెంకావారిపాళెం చెరువు, దొరువుల్లో చేపల వేలంను గురువారం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి రామకృష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు జలదంకి సచివాలయంలో జరుగునని తెలిపారు.